

తండ్రి చనిపోయిన గంటల వ్యవధిలోనే..
రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతి

ఉత్తమ సేవలకు ప్రశంసం
ఉద్యోగులకు అవార్డులు అందజేత

7 లో

పౌరుల నైతిక అభివృద్ధే

నిజమైన దేశాభివృద్ధి



సంగారెడ్డిలో జెండా ఎగురవేసి మాట్లాడుతున్న మంత్రి దామోదర్



- అంబేడ్కర్ మాటలు ప్రతి ఒక్కరికీ ఆచరణీయం
- రైతుకు భరోసా ప్రభుత్వ కనీస బాధ్యత
- రూ.250 కోట్లతో సంగారెడ్డిలో 500 పడకల ఆసుపత్రి
- స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 15 : 'దేశం అభివృద్ధి చెందడం అంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు.. పౌరుల నైతిక అభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి'.. అని బాబాసాహెబ్ అంబేడ్కర్ చెప్పిన మాటలు ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా పోలీస్ పరేడ్‌గ్రౌండ్స్‌లో 78వ స్వాతంత్ర్య దినోత్సవం గురువారం నాడు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం జవహలాల్ నెహ్రూ నేతృత్వంలో మొదలైన స్వపరిపాలన, అంబేడ్కర్, రాజేంద్రప్రసాద్ తదితర మేధావుల నేతృత్వంలో నిర్మించుకున్న గొప్ప రాజ్యాంగం.. భారతదేశ సమగ్రతను, సామ్యవాదాన్ని ప్రపంచానికి చాటి చెప్పాయన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నా అసంపూర్తిగా ఉన్న ప్రజల కలలు, ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఎన్నికల హామీ మేరకు ఆరు గ్యారెంటీల అమలును ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు.

మహాలక్ష్మితో మహిళలకు రూ.158 కోట్లు ఆదా

మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత రవాణా ద్వారా జిల్లాలో ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటివరకు 1.22 కోట్ల మంది మహిళలు ప్రయాణించారని మంత్రి పేర్కొన్నారు. మహిళలకు రూ.158 కోట్లు ఆదా అయ్యాయని తెలిపారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకం కింద జిల్లాలో 1,58,089 మంది వినియోగదారులకు రూ.9.30కోట్ల సబ్సిడీ అందించినట్టు తెలియజేశారు. గృహజ్యోతి పథకం ద్వారా 1,03,246 గృహవినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేసి రూ.30 కోట్లను ప్రభుత్వం డిస్కంలకు చెల్లించిందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సంవత్సరంలో 4.50 లక్షల గృహాలను నిర్మించతలపెట్టామని వెల్లడించారు. ఆసరా పథకం ద్వారా 1,58,223 మందికి ప్రతి నెలా రూ. 36 కోట్ల పింఛన్లు అందిస్తున్నామని వివరించారు. రైతుబీమా పథకం ద్వారా జిల్లాలో 2.48లక్షల మంది రైతులకు బీమా సౌకర్యం కల్పించామని మంత్రి తెలిపారు. 2023-24 సంవత్సరంలో మృతిచెందిన 1,284 మంది రైతు కుటుంబాలకు రూ. 64 కోట్ల సాయం అందిందని చెప్పారు. పంట రుణాలను మాఫీ చేయడం ద్వారా తొలి రెండు విడతల్లో 77,861 మంది రైతులకు రూ.564.69 కోట్లు లబ్ధి జరిగిందన్నారు. మూడో విడతలో గురువారం రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీ జరిగిందన్నారు.

త్వరలో వైద్య కళాశాల భవనం ప్రారంభం

సంగారెడ్డిలో రూ.153 కోట్లతో చేపట్టిన వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు త్వరలో పూర్తిచేసి ప్రారంభిస్తామని దామోదర్ తెలిపారు. 500 పడకల ఆధునాతన ఆసుపత్రికి రూ.250 కోట్లతో త్వరలో శంకుస్థాపన చేయనున్నట్టు వివరించారు. వట్‌పల్లిలో 30 పడకల సీహెచ్‌సీ, ఐదు చోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక మాతాశిశు ఆరోగ్య కేంద్ర భవనం, పట్టణ ఆరోగ్యకేంద్రాలకు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అందోల్‌లో కొత్త నర్సింగ్ కళాశాల, జోగిపేట ఆసుపత్రికి రూ.100 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. జిల్లాలో 756 పాఠశాలల్లో మౌలిక వసతులు, మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం పనులకుగాను రూ.28 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా ఇప్పటివరకు 2,936 స్వయం సహాయక సంఘాలకు రూ.250 కోట్ల రుణం మంజూరు చేసినట్లు చెప్పారు. సింగూరు కాల్వల మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.168 కోట్ల పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్లు చెప్పారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో నూతన చెరువుల నిర్మాణం కోసం రూ.57 కోట్లు మంజూరైనట్లు వివరించారు. గ్రామీణ నీటి పారుదలశాఖ ద్వారా జిల్లాలో మొత్తం 943 నివాస ప్రాంతాలకు సురక్షితమైన మంచి నీటి సరఫరా చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో శాంతిభద్రత పరిరక్షణ కోసం పోలీసుశాఖ అహర్నిశలు కృషి చేస్తుందని మంత్రి అభినందించారు. వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ ప్రభుత్వ శాఖలు ఆయా పథకాల శకటాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్, అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.







స్వాతంత్ర్య వేడుకల్లో విద్యార్థుల ప్రదర్శనలు



ఆకట్టుకున్న శకటం



కుస్తీ పోటీ ప్రదర్శనలో మంత్రి, కలెక్టర్



జాతీయ జెండాను ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న ప్రభుత్వ సలహాదారు కేశవరావు, పక్కన కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే రోహిత్‌రావు

ఎనిమిది నెలల్లోనే ఎంతో అభివృద్ధి

- హామీల అమలులో ముందున్నాం
- ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యం
- నిరుపేదలకు సొంతింటి కల త్వరలో సాకారం
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు
- మెదక్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం



మెదక్ పోలీస్ గ్రౌండ్‌లో గౌరవవందనం స్వీకరిస్తున్న కేశవరావు, కలెక్టర్, ఎస్పీ

మెదక్, ఆగస్టు 15: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల వ్యవధిలోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పురోగమిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేశవరావు ప్రశంసించారు. 78వ స్వతంత్ర్య దినోత్సవం జిల్లాకేంద్రమైన మెదక్‌లోని పోలీసు పేరేడ్‌గ్రౌండ్స్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కేశవరావు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తమ ప్రభుత్వం ఇప్పటికే పలు ఎన్నికల హామీలను నెరవేర్చిందని, రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని జిల్లాలో 1.07 కోట్ల వినియోగించుకున్నారని తెలిపారు.

గ్యాస్ సబ్సిడీ రూ. 5.99 కోట్లు, గృహజ్యోతికి రూ. 19.62 కోట్లు

సామాన్యుడికి వంటగ్యాస్ గుదిబండగా కాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద రూ.500కే వంట గ్యాస్ సరఫరా చేస్తున్నదని ప్రభుత్వ సలహాదారు చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 1,21,840 మంది వినియోగదారులకు 2,10,162 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.5.99 కోట్లు సబ్సిడీ అందించిందని వెల్లడించారు. గృహజ్యోతి కింద 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే 1,21,207 మందికి రూ.19.62 కోట్లు సబ్సిడీ అందజేసినట్టు తెలిపారు.

రుణమాఫీతో చరిత్ర

దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రేవంత్ సర్కారు రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించిందని కేకే కొనియాడారు. జిల్లాలో రైతు రుణమాఫీ క్రింద మొత్తం 74,342 మంది రైతులకు రూ.473.76 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఏకకాలంలో రుణమాఫీ చేయడంతో రైతాంగం పండగ జరుపుకుంటోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు జిల్లాలో 562 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా రూ. 20.62 కోట్ల పనులు చేపట్టినట్టు కేశవరావు తెలిపారు.

అనంతరం ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రావు, అదనపుఎస్పీ మహేందర్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మెదక్ అర్బన్ : స్వాతంత్ర్య వేడుకల్లో పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై శకటాలను ప్రదర్శించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పోలీసుల పరేడ్ కనువిందు చేసింది. మహిళాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు పలు యూనిట్లను అందజేశారు.





మెదక్‌లో స్వాతంత్ర్య వేడుకల్లో విద్యార్థుల ప్రదర్శన

ఉమ్మడి జిల్లాలో 53,479 మంది రైతులకు

రూ.710.22 కోట్లు మాఫీ

మెదక్, ఆగస్టు 15: రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ ప్రక్రియలో గురువారం రూ. 2లక్షల వరకు పంటరుణాలను మాఫీ చేసింది. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఇప్పటికే రెండు విడుతలు రుణమాఫీ చేసిన ప్రభుత్వం గురువారం మూడో విడత మాఫీ నిధులు విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో అసలు, వడ్డీ కలిపి రూ. 2లక్షల లోపు పంటరుణం పొందిన 53,479 మంది రైతులకు రూ. 710.22 కోట్ల నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సంగారెడ్డి జిల్లాలో 16,676 రైతు కుటుంబాలకు సంబంధించి 20,102 రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 281.66 కోట్లు జమ చేసింది. సిద్దిపేట జిల్లాలో 16,329 కుటుంబాలకు సంబంధించి 21,071 రైతుల ఖాతాల్లో రూ. 271.21 కోట్లు జమయ్యాయి. మెదక్ జిల్లాలో 9,445 కుటుంబాలలోని 12,306 మంది రైతుల ఖాతాల్లో రూ.157.35 కోట్లు డిపాజిట్ చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. అయితే, రైతులకు ఆధార్, రేషన్ కార్డులు, బ్యాంకు రుణఖాతాలో పేరు వేర్వేరుగా ఉండడం, ధరణిలో భూమి వివరాలు లభించక పోవడం తదితర సాంకేతిక కారణాల వల్ల వీరికి రుణమాఫీ కాలేదు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం జిల్లా కలెక్టరేట్లలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.



పంటపొలాల్లో చిరుతపులిగా భావించిన జంతువు

పొలాల్లో చిరుత సంచారం

- ఆందోళనలో గోపన్‌పల్లి-అసద్‌గంజ్ ప్రజలు
- అప్రమత్తమైన అటవీశాఖ

జహీరాబాద్, ఆగస్టు 15: సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండల పరిధిలోని గోపన్‌పల్లి, అసద్‌గంజ్ గ్రామాల శివారులో గురువారం ఉదయం చిరుతపులి కనిపించిందని గ్రామస్థులు చెప్పారు. గోపన్‌పల్లికి చెందిన రైతులు, ఉపాధికూలీలు పనుల కోసం వెళ్తున్న క్రమంలో ఎర్రవాగు వద్ద అబ్దుల్‌ముబీన్, సంజీవరెడ్డిలకు చెందిన పొలాల్లో చిరుత కనిపించింది. ఈ దృశ్యాన్ని పలువురు తమ మొబైల్ ఫోన్లలో చిత్రీకరించారు. విషయాన్ని గ్రామస్థులకు, అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అటవీశాఖ సిబ్బంది భాస్కర్, దుర్గయ్య, సంజీవ్, కృష్ణమ్మ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పాదముద్రలు కనిపించ లేదని వారు తెలిపారు. అయినా, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



గుమ్మడిదలలో ఓ ఇంట్లోకి చేరిన నీరు

దంచికొట్టిన వాన..

- అత్యధికంగా గుమ్మడిదలలో 9.3 సెంటీమీటర్ల వర్షపాతం
- మరో రెండు రోజులు వర్ష సూచన
- ఉమ్మడి జిల్లాకు ఎల్లో అలర్ట్

మెదక్ అర్బన్/గుమ్మడిదల, ఆగస్టు 15: ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. అత్యధికంగా సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో 9.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రెండు, మూడు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. గురువారం ఉదయం నుంచి ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రపురం 6.2 సెం.మీ., అమీన్‌పూర్ 5.9సెం.మీ., చౌటకూర్ 4.6సెం.మీ., కొండాపూర్ 4.0 సెం.మీ., సిద్దిపేట జిల్లాలోని మిర్‌దొడ్డి 3.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారవర్గాలు వెల్లడించాయి.

రెండు రోజులు వర్షసూచన

ఉమ్మడి మెదక్ జిల్లాలో రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతారణశాఖ వెల్లడించింది. గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడి వానలు పడుతాయని పేర్కొంది. ఈమేరకు ఉమ్మడి జిల్లాకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప, బయటకు, పొలాలకు వెళ్లవద్దని సూచించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రుతుపవనాలు చాలా చురుగ్గా కదులుతున్నాయని తెలిపింది. నైరుతి గాలుల ద్రోణి ప్రభావంతో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

భూ వివాదంలో మహిళలపై దాడి


మహిళపై దాడి చేస్తున్న భూపాల్‌రెడ్డి

శివ్వంపేట, ఆగస్టు 15: భూ వివాదంలో మహిళలపై దాడి చేసిన ఘటన మండల పరిధిలోని సికింద్లాపూర్ పిట్టలవాడలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. పిట్టలవాడలో హైదరాబాద్‌కు చెందిన మార్క్యారెడ్డి భూపాల్‌రెడ్డికి అక్కడ నివాసం ఉంటున్న పిట్టల వారి మధ్య కొంత కాలంగా భూవివాదం నెలకొంది. గురువారం భూపాల్‌రెడ్డికి సంబంధించిన వ్యక్తులు కడీలు పాతుతుండగా, తాము 50 ఏళ్లుగా ఇక్కడ ఉంటున్నామని, తమ భూముల్లోకి ఎందుకు వస్తున్నారని అడ్డుకోవడంతో పిట్టల రేఖతోపాటు రాధ, లత, శారద అనే మహిళలపై భూపాల్‌రెడ్డి చేయి చేసుకుని చంపి వేస్తానని బెదిరించాడని బాధితులు ఆరోపించారు. హైదరాబాద్‌కు చెందిన ఈ వ్యక్తులు తమ భూమిని కాజేయాలన్న ఉద్దేశంతో దాడులకు ఒడిగడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి భూమినే నమ్ముకుని జీవిస్తున్న తమ కుటుంబాలకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ విషయమై తహశీల్దార్ శ్రీనివాస్‌చారిని సంప్రదించగా మార్క్యారెడ్డి, భూపాల్‌రెడ్డిలను భూ సమస్య పరిష్కరించే వరకు భూమి వద్దకు వెళ్లవద్దని చెప్పామని, పట్టాభూమి అటవీ ప్రాంతంలో ఉన్నందున భూవివాదం నెలకొనడంతో అటవీ, రెవెన్యూ శాఖల జాయింట్ సర్వేకు ఫారెస్ట్ అధికారులను కోరినట్లు తెలిపారు.

మహాత్మాగాంధీ విగ్రహావిష్కరణ

వర్గల్, ఆగస్టు 15: జాతిపిత మహాత్మా గాంధీ కలలు కన్నటువంటి గ్రామ స్వరాజ్యం దిశగా రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ నడిపించారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దండుపల్లిలో గురువారం మహాత్మా గాంధీ విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరై గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎందరో త్యాగధనుల స్ఫూర్తి, జాతిపిత మహాత్మాగాంధీ సారథ్యం, మహానుభావుల కృషి ఫలితమే స్వాతంత్ర్యమన్నారు. ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించిన ఘనత కేసీఆరదేనన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాములు, మాజీ జడ్పీటీసీ బాలుయాదవ్, మాజీ ఎంపీపీ లత రమేశ్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, యూత్ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు శివ తదితరులు ఉన్నారు.


దండుపల్లిలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి


శేరిపల్లిలో దొడ్డి కొమురయ్య విగ్రహం ఆవిష్కరిస్తున్న మాజీ జడ్పీటీసీ బాలుయాదవ్

దొడ్డి కొమురయ్య అడుగుజాడల్లో నడవాలి

వర్గల్, ఆగస్టు 15: దొడ్డి కొమురయ్య అడుగు జాడల్లో యువత నడవాలని వర్గల్ మాజీ జడ్పీటీసీ బాలు యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని శేరిపల్లిలో కురుమ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బింగి స్వామి, గ్రామ కుర్మ సంఘం నాయకులతో కలిసి గురువారం దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం కుర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలుయాదవ్ మాట్లాడుతూ.. పోరాడితే పోయిదేమీలేదన నినాదంతో దొరలతో భూమి కోసం, భుక్తి కోసం పోరాటం చేసిన కొమురయ్య అమరుడైయ్యారన్నారు. వెట్టి చాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాట సేనాని ప్రజలకు వినిపించారన్నారు. అనంతరం కురుమ రిజర్వేసన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బింగి స్వామి మాట్లాడుతూ.. దొడి కొమురయ్య పోరాటమే ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో కుర్మ సంఘం అధ్యక్షుడు బాషయ్య ఉపాధ్యక్షుడు గడ్డం అయిలయ్య ప్రధాన కార్యదర్శి మహేశ్, కోశాధికారి గడ్డం బీరయ్య, గ్రామ మాజీ సర్పంచ్ నారాయణ, సంఘం నాయకులు రాజు, కొనింటి అయిలయ్య, సంతోష్, ర్యాక రాజయ్య, గట్ల శ్రీను తదితరులు ఉన్నారు.



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏడుపాయల వనదుర్గా అమ్మవారిని వివిధ రకాల పూలతో జాతీయ పతాకంలోని మూడు రంగులు వచ్చేలా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు.
- పాపన్నపేట

దేశభక్తి



స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా సంగారెడ్డి పట్టణంలోని వాసవి మహాసంస్థాన్‌లో ఉమా రామలింగేశ్వర స్వామికి ఆలయ పురోహితుడు పండిత్ బల్దేవ్ జాతీయ పతాకాన్ని అలంకరించారు.
- సంగారెడ్డి రూరల్



సంగారెడ్డి జిల్లా కేంద్రంలో స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టరేట్, క్యాంపు కార్యాలయం, జడ్పీ కార్యాలయాల్లో కలెక్టర్ వల్లూరు క్రాంతి జాతీయ జెండాను ఆవిష్కరించారు.
- సంగారెడ్డి రూరల్



మెదక్ జిల్లా కేంద్రంలో స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా జరిగాయి. పలు చోట్ల కలెక్టర్ రాహుల్‌రాజ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పండుగ వాతావరణం నెలకొంది.
- మెదక్ అర్బన్

ప్రశంస

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విధుల్లో ప్రతిభ కనబరిచిన వివిధ శాఖల ఉద్యోగులకు ప్రశంసా ప్రతాలను అందజేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్, మెదక్‌లో ప్రభుత్వ సలహాదారు కేశవరావు, సంగారెడ్డిలో మంత్రి దామోదర్ రాజనర్సింహాలు పతాకావిష్కరణలు చేసి, ఆయా జిల్లాల ఉద్యోగులకు, పోలీసు శాఖ వారికి ప్రశంసపత్రాలను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్లు మనుచౌదరి, రాహుల్ రాజ్, వల్లూరి క్రాంతి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రశంస ప్రతాలు అందుకున్న ఉద్యోగుల్లో నూతనోత్సాహం కనిపించింది.





సంగారెడ్డి ఎస్పీ రూపేష్‌కు ప్రశంస పత్రం అందజేస్తున్న మంత్రి











ఇక్కడ జెండా ఎగరలే..

నారాయణఖేడ్, ఆగస్టు 15: బీఎస్ఎన్ఎల్ (భారత్‌సంచార్ నిగమ్ లిమిటెడ్) కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఎగురలేదు. ఈ ఏడాది అధికారులు ఎవరూ లేకపోవడంతో జెండా ఎగురవేయలేదు. కార్యాలయంపై జెండా ఎగుర వేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల అభివృద్ధి సంఘం డివిజన్ అధ్యక్షులు నరేందర్ డిమాండ్‌చేశారు.

పతకావిష్కరణలో ఇరువర్గాల ఘర్షణ

శివ్వంపేట, ఆగస్టు 15: మండల పరిధిలోని దొంతి గ్రామంలో గాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండా ఆవి ష్కరణ విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య వివాదం నెలకొంది. గాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండాను ఏర్పాటు చేయగా జెండాను నేను ఎగరవేస్తానంటూ బీఆర్ఎస్ నాయకులు ముందుకు రావడంతో అధికార పార్టీకి చెందిన వారు మేమే ఎగరవేస్తామని చెప్పడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. దీంతో పోలీసులు సర్దిచెప్పారు. చివరికి గ్రామ పెద్దగా పురోహితుడు గోపాలకృష్ణ శర్మను జెండాను ఎగర వేయాలని కోరడంతో ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

తలకిందులుగా త్రివర్ణ పతాకావిష్కరణ



గజ్వేల్, ఆగస్టు 15: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండావిష్కరణలో అపశృతి చోటుచేసుకుంది. మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి జాతీయజెండాను తలకిందులుగా ఎగురవేశారు. అక్కడి వారు గుర్తించి జెండా కిందికి దించి సరిచేయడంతో మళ్లీ ఎగురవేశారు. ఈ విషయమై గజ్వేల్ బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తండ్రి చనిపోయిన గంటల వ్యవధిలోనే..

రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతి



వెంకటేశం(ఫైల్)

హత్నూర, ఆగస్టు 15: తండ్రి అంత్యక్రియలు జరిగిన గంటల వ్యవధిలోనే రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతి చెందిన విషాద ఘటన ఇది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం సాదుల్లానగర్ గ్రామంలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అండూరి వెంకటేశం (45) తండ్రి ఇందూరి నర్సింలు బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. అదే రోజు సాయంత్రం సాదుల్లానగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన కుమారుడు అండూరి వెంకటేశం తండ్రి అంత్యక్రియలు ముగిసిన వెంటనే ఏదో పని నిమిత్తం బైక్‌పై దౌల్తాబాద్‌కు వెళ్లి స్వగ్రామానికి తిరుగు పయనమయ్యాడు. రెస్టిల్ పరిశ్రమ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న కారు.. వెంకటేశం బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశం తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతను నడుపుతున్న బైక్ పెట్రోల్ ట్యాంక్ మూత ఊడిపోగా స్పార్క్ వచ్చి మంటలు చెలరేగి బైక్ పూర్తిగా దగ్ధమైపోయింది. అప్పటికే ఆ కుటుంబంలో ఒకరు చనిపోయి, దుఃఖసాగరంలో మునిగి ఉండగా, వెంటనే మరొకరు చనిపోవడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరమైంది. వెంకటేశంకు ఇద్దరు కుమార్తెలు కాగా, ఇద్దరికీ వివాహాలు అయ్యాయి. వెంకటేశం భార్య గతంలోనే చనిపోయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీ కొని యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు



విలాస్ (ఫైల్)

నారాయణఖేడ్, ఆగస్టు 15: ఆర్టీసీ బస్సు ఢీ కొని బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడు అక్కడిక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన నిజాంపేట మండలం మేఘ్యానాయక్ తండా దర్గా సమీపంలోని 161 బీ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. షోలాపూర్‌కు చెందిన నీలకంఠి విలాస్(35) పెద్దశంకరంపేటకు చెందిన యువతిని పెళ్లి చేసుకుని, ఇక్కడే మొబైల్ షాప్ నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం నారాయణఖేడ్ నుంచి పెద్ద శంకరంపేటకు మెదక్ మండలం కొత్తపేటకు చెందిన ప్రవీణ్, సురేష్‌లతో కలిసి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో నిజాంపేట నుంచి నారాయణఖేడ్‌కు వస్తున్న యాదగిరి గుట్ట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మూల మలుపు వద్ద వేగంగా వచ్చి వీరి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో నీలకంఠి విలాస్ అక్కడికక్కడే చనిపోయాడు. ప్రవీణ్, నరేష్‌లు గాయపడ్డారు. మరణించిన విలాస్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గాయపడిన వారిని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బెల్ట్‌షాపుల్లో మద్యం పట్టివేత

రామచంద్రాపురం, ఆగస్టు 15: బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారంతో కొల్లూరు పోలీసులు మూడు చోట్ల దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు సీఐ రవీందర్ కథనం ప్రకారం... కొల్లూరులో రాజు అనే యువకుడికి చెందిన కిరాణం దుకాణంలో సోదాలు నిర్వహించగా 23 లీటర్ల మద్యం లభించింది. తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్‌లలోని లేబర్ షెడ్లలో మద్యం విక్రయిస్తున్న ఆంజనేయులు, కనక రాయుడుల వద్ద 8 లీటర్ల చొప్పున మొత్తం 16 లీటర్లు స్వాధీన పరుచుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, 39 లీటర్ల మద్యం సీజ్ చేశారు. బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

78 స్వాతంత్ర్య వేడుకలు మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ప్రభుత్వ, పార్టీ, గ్రామపంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, ఎంపీడీవోలు, ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, ఉపాధ్యాయులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. మహనీయుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.


ఖేడ్ తహసీల్ మైదానంలో విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి


కందిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, నాయకులు


నర్సాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి


రామచంద్రాపురంలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో జాతీయ జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


సంగారెడ్డి క్రైం: జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎస్పీ రూపేష్


మెదక్ అర్బన్: క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు


జహీరాబాద్ క్యాంపు కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, తదితరులు


కల్హేర్‌లో జాతీయ పతాకాలతో ప్రభాత్‌భేరి నిర్వహిస్తున్న శ్రీసాయి విద్యాలయం విద్యార్థులు



సంగారెడ్డి క్రైం: జాతీయ జెండాను ఎగురవేస్తున్న సెయింట్ ఆంథోనీస్ పాఠశాల డైరెక్టర్ ఈదర ఆంథోనీరెడ్డి, ప్రమీల


పెద్దశంకరంపేటలో తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేసిన తహసీల్దార్ గ్రేస్‌బాయ్


మెదక్ మున్సిపాలిటీ: బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి


జోగిపేటలోని బీఆర్ఎస్ కార్యాలయం జాతీయ జెండాకు వందనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్


నారాయణఖేడ్‌లో జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


కల్హేర్‌లో జాతీయ జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ శివ శ్రీనివాస్


కంగ్టి తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండాకు మంగళ హారతినిస్తున్న ఎమ్మార్వో విష్ణుసాగర్


కోహీర్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండాకు వందనం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది, నాయకులు


ఝరాసంగంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగరవేస్తున్న దృశ్యం


హవేళిఘణపూర్ తసీల్దార్ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్ నారాయణ


టేక్మాల్ ఎంపీడీవో కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎంపీడీవో రియాజొద్దీన్


చేగుంట తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ స్వప్న


చిన్నశంకరంపేట ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద జెండాకు వందనం చేస్తున్న డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి


రేగోడు రెవెన్యూ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్ బాలలక్ష్మి


అమీన్‌పూర్ మున్సిపల్ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న చైర్మన్ పాండురంగారెడ్డి


నిజాంపేటలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో జెండాకు వందనం చేస్తున్న దృశ్యం


కొడిపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట జెండాకు వందనం చేస్తున్న మండల ప్రత్యేకాధికారి సాయిబాబ


శివ్వంపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌చారి


తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతీకృష్ణ


కోనాయపల్లి పిటిలో జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న గ్రామస్థులు


తూప్రాన్ పట్టణంలోని గీతా స్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శనలు


బొల్లారం మున్సిపల్ కార్యాలయం వద్ద స్వాతంత్ర్య వేడుకల్లో చైర్‌పర్సన్ రోజారాణి, వైస్ చైర్మన్ అనిల్‌కుమార్


మునిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్ ఆశాజ్యోతి


గుమ్మడిదల: రైతు సహకార సంఘం సొసైటీ భవనం వద్ద జెండాకు వందనం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



మెదక్ అర్బన్: స్వాతంత్ర్య వేడుకల్లో సిద్ధార్థ్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, విద్యార్థులు

ఉమ్లాతండాను పంచాయతీలో చేర్చొద్దని ఎమ్మెల్యేకు వినతి

నారాయణఖేడ్, ఆగస్టు 15: నాగల్‌గిద్ద మండలంలోని శాంతినగర్‌తండా పంచాయతీలో ఉన్న ఉమ్లాతండాను కొత్త పంచాయతీగా ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ జారీఅయ్యింది. ఈ నేపథ్యంలో ఉమ్లాతండాలో తమ తండాను చేర్చొద్దని శాంతినగర్ పంచాయతీ పరిధిలోని కారోబారి తండావాసులు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. గెజిట్ ప్రకారం తమ తండాను నూతనంగా ఏర్పాటయ్యే ఉమ్లాతండా పరిధిలో చేర్చారన్నారు. దీనికింద ప్రతిపాదించిన నాలుగుతండాల్లో జనాభా 200లోపే ఉండగా.. కారోబారితండా నుంచి ఉమ్లాతండాకు వెళ్లడానికి రెండు కిలోమీటర్ల దూరం అవుతుందన్నారు. మధ్యలో రెండు పెద్దవాగులు ఉన్నాయని, వర్షాకాలంలో వెళ్లలేని పరిస్థితి ఉంటుందన్నారు. అందువల్ల కారోబారి తండాను ఉమ్లా తండా పంచాయతీలో కలపకుండా శాంతినగర్‌తండా పంచాయతీలోనే కొనసాగించాలని కోరారు.

'సహారా' ఆధ్వర్యంలో డి-అడిక్షన్ అవేర్‌నెస్ క్యాంపెయిన్

- పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 15: సహారా ఇన్‌క్లూజివ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో డి-అడిక్షన్ అవేర్‌నెస్ క్యాంపెయిన్ నిర్వహించడం అభినందనీయమని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సహారా ఆస్పత్రి ఆధ్వర్యంలో చేపట్టే డి-అడిక్షన్ అవేర్‌నెస్ క్యాంపెయిన్‌కు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్‌తో కలిసి గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. డి-అడిక్షన్(వ్యసనం)వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించాలని నిర్వాహకులను కోరారు. ఆస్పత్రి ఎండీ మఠం శంకర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తొమ్మిది నెలల పాటు డి-అడిక్షన్ అవేర్‌నెస్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సంగారెడ్డిలో 24న కలెక్టరేట్ నుంచి ఎస్పీ ఆఫీస్ వరకు 3కే రన్ నిర్వహించి అవేర్‌నెస్ చేయనున్నట్లు శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర్, కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్, సహారా ఎండీ శంకర్

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య


ఆర్తీదేవి(ఫైల్)

గుమ్మడిదల, ఆగస్టు 15: కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. బీహార్ రాష్ట్రానికి చెందిన సికిందర్ కుమార్, ఆర్తీదేవి దంపతులు కొన్నేళ్లుగా దోమడుగు గ్రామంలో నివాసముంటూ.. ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. వీరికి ఓ బాలుడు ఉన్నాడు. ఆర్తీదేవి(24) కడుపునొప్పితో బాధపడుతుండేది. నొప్పిని భరించలేక గురువారం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్కూల్ నుంచి ఇంటికొచ్చిన కుమారుడు దేవరాజ్ తలుపులు తెరిచి చూసేసరికి ఆర్తీదేవి ఉరేసుకుని కనిపించింది. ఈ విషయాన్ని మేనమామ చందన్‌కుమార్‌కు సమాచారమందించాడు. వెంటనే అతను బావ సికిందర్‌కు, అతని తమ్ముడు ప్రిన్స్‌కుమార్‌కు చెప్పాడు. వారు వచ్చి చూసేసరికి ఆర్తీదేవి మృతిచెంది ఉన్నది. మృతురాలి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.





రక్తదానం మరెందరికో ప్రాణదానం

- ఎమ్మెల్యే సునితారెడ్డి

నర్సాపూర్, ఆగస్టు 15: రక్తదానం మరెందరికో ప్రాణదానమని ఎమ్మెల్యే సునితారెడ్డి పేర్కొన్నారు. గురువారం లక్ష్మారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంగా రక్తదానం చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ తన భర్త లక్ష్మారెడ్డి వర్ధంతి సందర్భంగా ప్రతి ఏడాది ఆగస్టు 15న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ జడ్పీటీసీ బబియానాయక్, మాజీ జడ్పీ కో ఆప్షన్ మన్సూర్, నాయకులు పాల్గొన్నారు.

స్టోన్ క్రషర్ ఏర్పాటు చేయొద్దు

జిన్నారం, ఆగస్టు 15: రాళ్లకత్వలో నూతన స్టోన్ క్రషర్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్థానికులు ప్రధాన రహదారిపై గురువారం ధర్నా నిర్వహించారు. ఇటీవల గ్రామ శివారులో కొత్త స్టోన్ క్రషర్ కోసం పనులు నిర్వహిస్తుండగా.. క్రషర్ ఏర్పాటుతో తీవ్రంగా నష్టపోతామని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రషర్‌కు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం కృషి: ఎమ్మెల్సీ

జహీరాబాద్, ఆగస్టు 15: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం కృషిచేస్తుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీనివాస్‌మహాల్‌లో గురువారం టీబీస్, పీర్టీయూ ఆధ్వర్యంలో అభినందన సభను నిర్వహించారు. అందులో భాగంగా ఇటీవల పాండిచ్చేరి యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన తులసీరాంరాథోడ్, తదితరులను సన్మానించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే.. ఉపాధ్యాయులకు సంబంధించి ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించిందని గుర్తు చేశారు. పీఆర్టీయూ నాయకులు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మిత్ర-88 ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులకు బంగారు, వెండి పతకాలు

జోగిపేట, ఆగస్టు 15: జోగిపేట ఉన్నత పాఠశాలలో 1987-88 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సంఘం మిత్ర-88 ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులకు స్వర్ణ, రజత పతకాలతో ప ఆటు నగదు పురస్కారాలను అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో మొదటిస్థానంలో నిలిచిన దేవకీనందన్‌కు అల్లె చిన్న మలట్లయ్య స్మారక బంగారు పతకం, నగదును, ద్వితీయస్థానంలో నిలిచిన వివేక్‌కు ఆకుల శంకరమ్మ స్మారక రజత పతకం, నగదును అల్లె శ్రీకాంత్, డాక్టర్ ఆకుల వెంకటేశంలు అందజేశారు. ఇతర స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు షాబుద్దీన్ స్మారక అవార్డులతోపాటు, నగదు పురస్కారాలను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్ర-88 సభ్యులు సార ప్రభాకర్, రాజేశ్వర్‌గుప్తా, సాయిరాం, వడ్ల మురళి, శ్రీనివాస్‌రావు, టేక్మాల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి పీచుతో నర్సరీ మొక్కల పెంపకం

గుమ్మడిదల, ఆగస్టు 15: ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించి, కాలుష్య భూతాన్ని నివారిద్దామని గుమ్మడిదలకు చెందిన నిర్మల అనే మహిళ కొబ్బరి పీచుతో తయారుచేసిన వస్తువులో నర్సరీ మొక్కలను పెంచుతోంది. ఇన్నోవేషన్ ప్రోగ్రాం ద్వారా జిల్లా కేంద్రంలోని సంగారెడ్డిలో దానిని ప్రదర్శన చేశారు. కొబ్బరి పీచుతో నర్సరీ పెంపకం ద్వారా మొక్కలకు కాలుష్యం లేకుండా పూర్తిగా పెరుగుతుందని మహిళలు కల్పించారు. అనంతరం కలెక్టర్ చేతులమీదుగా నిర్మల ప్రశం